క్లుప్తంగా

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

భాకరాపేట : జగనన్న ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందని ఎర్రావారిపాళెం ఎంపీపీ శివలక్ష్మి తెలిపారు. ఎర్రావారిపాళెం మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. మండలంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పలు అభివృద్ధి పనులు చేపట్టారని, ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి చేసినట్లు వివరించారు. జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభాగాల విలీనాన్ని ఆపండి

తిరుపతి సిటీ : ఎస్వీయూలో విభాగాల విలీన ప్రక్రియలో వివిధ విభాగాల్లోని పోస్టుల సంఖ్యను కుదించడంపై అకాడమిక్ కన్సల్టెంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆక్షేపణ తెలిపారు. వారు బుధవారం వీసీ రాజారెడ్డికి, రిజిస్ట్రార్ ఓఎండీ హుస్సేన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆ సంఘం నేతలు కే.కిషోర్ కుమార్ రెడ్డి, ఐఎస్ కిషోర్, జగదీశ్వరి, సునీత, దాము యాదవ్, అంజన్ సింగ్, దీన దయాల్, శివశంకర్ రాయల్, బాలు, సుధేష్ణ, వీరారెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, రఘు పాల్గొన్నారు.

రైల్వే సేవలపై అవగాహన

తిరుపతి అర్బన్: రైల్వే భద్రతా విభాగం ప్రయాణికులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైల్వే ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపారు. చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు బుధవారం తిరుపతి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. వారికి ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ చట్టాలతోపాటు రైల్వే ట్రోల్ ఫ్రీ నంబర్లు 139, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సఖీ 181పై అవగాహన కల్పించారు.

కనుల పండువగా ద్రౌపదీ కల్యాణం

చంద్రగిరి: పాతపేటలోని ద్రౌపది సమేత ధర్మరాజులు ఆలయంలో బుధవారం రాత్రి ద్రౌపది కల్యాణాన్ని కనుల పండువగా చేపట్టారు. ఉభయదారులను పినపెద్ద విరూపాక్షి శంకర్‌రెడ్డి సత్కరించారు. మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, కొత్తపాటి కోటి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రభుత్వ విప్

తిరుమల: శ్రీవారిని బుధవారం ప్రభుత్వ విప్ కొరుముట్ల శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించారు.

ఆకట్టుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రాలు





అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల మనుసు దోచేస్తున్న చిత్రాలు

భాకరాపేట: ప్రశాంత వాతావరణం, రంగు రంగుల వస్తువులు, బొమ్మలు ఉంటే చిన్న పిల్లలు బాగా ఆడుకుంటారు. ఆటలు, పాటలతో వారిని చదువుపై దృష్టిమళ్లించేలా చేయాలి. తద్వారా వారి మానసిక వికాసానికి బాటలు వేయాలి. ఇందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్న పిల్లలకు ఆహ్లాదాన్ని పంచడంతోపాటు విద్యా బుద్ధులు నేరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. చంద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. వాటిలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయి విద్యను అందించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. ఆహ్లాద వాతావరణం, సులభంగా బోధన, చిన్నారులను ఆకట్టుకునేలా అంగన్‌వాడీ భవనాన్ని చిత్రాలతో తీర్చిదిద్దుతున్నారు. గోడలపై రాసిన అక్షరమాలలు, అంకెలు, చిత్రించిన బొమ్మలు, తల్లులు, పిల్లలకు పోషక విలువలు తెలిపే వివరాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. పిల్లలకు, గర్భవతులు, బాలింతలకు విజ్ఞానాన్ని పంచేలా కేంద్రాలను మారుస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వ నిధులతోపాటు గ్రామాల్లోని శ్రీమంతుల సాయం తీసుకుంటున్నారు.

మనసును దోస్తున్న బొమ్మలు

అంగన్‌వాడీ కేంద్రంలోని గోడలకు వేసిన బొమ్మలు చంటి పిల్లల మనుసును దోచేస్తున్నాయి. అలాగే ఆటవస్తువులు, బొమ్మలు పిల్లలను మరింత ఆకట్టుకుంటున్నాయి. చంద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, చంద్రగిరి, రామచంద్రాపురం, తిరుపతి రూరల్ మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీ వర్కర్లు దాతల సహకారాన్ని తీసుకుని మోడల్ కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు.

> **అంగన్‌వాడీ అంటే చంటి బిడ్డలు పరుగులు తీయాలి**
>
> అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు ఇష్టంగా వచ్చేలా బొమ్మలతో తీర్చిదిద్దుతున్నాము. ఇందులో అంగన్‌వాడీ వర్కర్ల కృషి చాలా ఉంది. చంటి పిల్లల ఆరోగ్యం, వారి ఎదుగుదల, ఆహ్లాద భరిత వాతావరణం అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు.
>
> – ప్రదీప, సీడీపీవో, చంద్రగిరి

నగర అభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా : ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో వుంచుకుని నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆయన బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నగర అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరానికి కనెక్టివిటీ పెంచడం, నగర విస్తరణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఇప్పటికే అభివృద్ధి దశలో వున్న మాస్టర్‌ప్లాన్ రోడ్లు, వాటితో నగరానికి కలిగే ప్రయోజనాలు, ఇప్పటికే రూపొందించిన ప్రణాళికలు, భవిష్యత్‌లో చేపట్టనున్న పనుల ప్రతిపాదనలను తెలియజేశారు. తద్వారా కలిగే లాభాలను వివరించారు. నగరంలో ఫ్రీలెఫ్ట్‌లను ఏర్పాటుచేశామని, వాహనదారులకు ఇబ్బందులను తొలగించామని వెల్లడించారు.

పేదలకు అన్నదానం



తిరుపతి కల్చరల్: తిరుమల జ్యువెలర్స్ అధినేత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బచ్చల కరుణాకర్ వర్ధంతిని బుధవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా న్యూ తిరుమల జ్యువెలర్స్ ప్రొప్రైటర్ రామమూర్తి ఆధ్వర్యంలో గాంధీ రోడ్డులో పేదలకు అన్నదానం చేశారు.

వాజ్‌పాయికి ఘన నివాళి

తిరుపతి గాంధీ రోడ్డు: మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పాయి వర్ధంతిని బుధవారం బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుండాల గోపీనాథ్ రెడ్డి, అక్కినపల్లి మునికృష్ణ యాదవ్, తొండంనాడు సుబ్రమణ్యం రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, దీపక్ యాదవ్, ఏ వన్ క్యాటరింగ్ మస్తాన్, హరికృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

మంత్రి మేరుగ నాగార్జునకు ఘన స్వాగతం

తిరుపతి కల్చరల్: తిరుమల, తిరుపతి పర్యటన కోసం మంత్రి మేరుగ నాగార్జున బుధవారం రాత్రి పద్మావతి అతిథి గృహం చేరుకున్నారు. ఆయనకు ఎస్వీయూ పాలక మండలి సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర నేత మల్లారపు మధు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని దళితులు, ఉద్యోగుల సమస్యలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ తదితర విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. సోషియల్ వెల్ఫేర్ ఆఫీసర్లు రాజ్యలక్ష్మి, చిన్నయ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేత బాల, సురేంద్ర, వెంకట్, రాజశేఖర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

స్థానిక ఆలయాలను సందర్శించిన టీటీడీ చైర్మన్ భూమన



గోవిందరాజస్వామిని దర్శించుకున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, జేఈవో వీరబ్రహ్మం

తిరుపతి కల్చరల్: టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి బుధవారం గోవిందరాజస్వామి, కోదండరామాలయం, కపిలేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. కోదండరామస్వామి ఆలయంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం శాలువతో సత్కరించారు. కపిలేశ్వరస్వామి ఆలయంలో అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. డెప్యూటీ ఈవోలు శాంతి, నాగరత్న, సీఏవో శేషశైలేంద్ర, డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు పాల్గొన్నారు.

సీమల్లవరంలో గడప గడపలో ఆత్మీయ పలకరింపు



సీమల్లవరంలో పర్యటిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి, సర్పంచ్ మొక్కల భారతి

తిరుపతి రూరల్: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి బుధవారం తిరుపతి రూరల్ సీమల్లవరం పంచాయతీలో గడప గడపలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఆమెకు సర్పంచ్ మొక్కల భారతి, ఎంపీటీసీ సుభాషిణి ఆధ్వర్యంలో స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను వివరించారు. వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. స్థానికులు మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి తమను పెద్దన్నలాగా ఆదుకుంటున్నారని, చిన్న వయస్సులోనే ఓర్పుగా, నేర్పుగా ప్రజా సంక్షేమం కోసం తండ్రి బాటలో నడుస్తున్న మోహిత్‌రెడ్డి తమ పంచాయతీలో రూ.9 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొక్కల తిమ్మారెడ్డి, మల్లారపు వెంకటరమణ, సిద్ధారెడ్డి, కేశవమూర్తి, జానీ, మగ్బుల్‌ఖాన్, సుజీత్, సాయిల్, మస్తాన్ పాల్గొన్నారు.

గడప గడపలోనూ సంక్షేమం



హర్షిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

రామచంద్రాపురం: ప్రతి గడపకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించినట్టు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం చిట్టత్తూరు, కాలేపల్లి, కాలేపల్లి హరిజనవాడలో గడప గడపకూ మీ హర్షిత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్సీపురం ఇన్‌చార్జి గణపతి నాయుడు, సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు మంజుల, చంద్రశేఖర్‌రెడ్డి, మునీంద్రబాబు, రాజేష్, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

డోర్ నంబర్ స్పష్టంగా ఉండాలి



ఓటరు జాబితాపై సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: నగరంలోని ప్రతి ఇంటి ముందూ డోర్ నంబర్ స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులను తిరుపతి ఎన్నికల ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. ఆమె బుధవారం ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఇంటింటి సర్వే, ఓటర్ల జాబితాపై నాయకుల నుంచి సలహాలు తీసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీకి ఇంటింటి సర్వే పూర్తవుతుందన్నారు. ఎవరికైనా అనుమానాలు ఉంటే అధికారులను కలిసి నివృత్తి చేసుకోవాలని సూచించారు. నగరంలో అన్ని ఇళ్ల వద్దా ఇప్పటికే ఎన్నికల డోర్ నంబర్, మున్సిపల్ డోర్ నంబర్లను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని ఆదేశించామని చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, తహసీల్దార్ వెంకటరమణ, డీటీ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఏటా అధ్యక్షురాలిని మార్చాలి

చంద్రగిరి: మహిళా సమాఖ్యలో ప్రతి ఏటా తప్పనిసరిగా గ్రూపు లీడర్‌ను మార్చాలని, అలా కాని పక్షంలో రెండేళ్లకైనా మార్చాలని ఐబీ డీపీఎం మాధవి తెలిపారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రూపుల ఏర్పాటు, సభ్యుల సంఖ్య, సమావేశాల నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు తదితరాలపై పలు సూచనలు చేశారు. మండల సమాఖ్య 2022–23 ఆర్థిక సంవత్సర ఆర్థిక లావాదేవీల్లో రూ.20.71 లక్షలు ఆదాయం లభించినట్లు తెలిపారు. అనంతరం సమాఖ్య అధ్యక్షురాలిగా పి.తరంగిణిని, 12 మంది పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అదేవిధంగా టాటా క్యాన్సర్ హాస్పిటల్ సిబ్బంది క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఏపీఎం సరిత, సీసీలు ఆషా, ధనుంజయ, గిరి, సుధాకర్, అరుణ, స్త్రీనిధి మేనేజర్ వీరేష్, సమాఖ్య అకౌంటెంట్ జమీలా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో ఐదుగురికి ప్రతిభా పురస్కారాలు



వీసీ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న టి.సరిత, హేమశ్రీ, రవీంద్రబాబు

తిరుపతి సిటీ : తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల(ఆర్ఏఆర్ఎస్)కు చెందిన ఐదుగురు నాన్ టీచింగ్ సిబ్బందికి ఎన్‌జీరంగా యూనివర్సిటీ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఉత్తమ ప్రతిభా పురస్కారాలు ప్రకటించింది. వారు మంగళవారం గుంటూరులోని ఎన్‌జీరంగా వ్యవసాయ వర్సిటీలో వీసీ నుంచి పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి సీనియర్ అసిస్టెంట్ టి.సరిత, అగ్రికల్చరల్ ఆఫీసర్ హేమశ్రీ, వ్యవసాయ కళాశాల నుంచి రికార్డ్ అసిస్టెంట్లు రవీంద్రబాబు, మహేశ్వరి, డ్రైవర్ కుమార్ ఉన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు ఆదర్శం



అన్నదానం చేస్తున్న గౌడ సంఘం నాయకులు

తిరుపతి కల్చరల్/తిరుపతి అర్బన్: బాలాజీ గౌడ సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం శంకరంబాడి సర్కిల్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. పేదలకు అన్నదానం చేశారు. పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులకు రూ.2000 చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేశారు. గౌడ సంక్షేమ సంఘం చైర్మన్ శ్యామల ఈశ్వరయ్య గౌడ్, జిల్లా అధ్యక్షుడు టి.పురుషోత్తం గౌడ్, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు యార్లపల్లి గోపి ఆధ్వర్యంలో లీలామహల్ సర్కిల్‌లో గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టి.చెంగయ్య గౌడ్, టి.చిరంజీవి గౌడ్, బాలక్రిష్ణ గౌడ్, రామారావు, మునిశేఖర్, మునిబాలక్రిష్ణ, వివేక్ గౌడ్, కుమార్, జయచంద్ర, నరసింహులుగౌడ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

తిరుచానూరు(చంద్రగిరి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి కోరారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సహకారంతో తిరుచానూరు పంచాయతీ పరిధిలోని గంగమ్మ ఆలయం, యోగిమల్లవరం సచివాలయం (వసుంధర నగర్), దామినేడు ఇందిరమ్మ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను ఆయన బుధవారం పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అక్కడికి వచ్చిన వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నరేష్‌రెడ్డి, వార్డు సభ్యుడు మునీంద్ర రాయల్, చంద్ర, శేఖర్ రెడ్డి, వాసు, వెంకటేష్, చెంగల్, ఆర్ఐ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్.శివశంకర్‌రాజు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

పాకాల : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ ఉషారాణి తనిఖీ చేశారు. రికార్డులు, డాక్యుమెంట్లను పరిశీలించారు. రిజిస్ట్రేషన్లలో సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించారు. ఎస్ఆర్ఓ లక్ష్మీనారాయణ, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

తిరుపతి అర్బన్: అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చని ఇన్‌చార్జి డీపీటీవో జితేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా ప్రజా రవాణా కార్యాలయంలో బుధవారం ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలోని డ్రైవర్లకు విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ నెల 29వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, డీఎం బాలాజీ పాల్గొన్నారు.

ఎర్రమరెడ్డిపాళెం రైతుల నిరసన

తిరుపతి అర్బన్: రేణిగుంట మండలం ఎర్రమరెడ్డిపాళెం గ్రామ రైతులు సాగుచేసుకుంటున్న భూములకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత కోరారు. ఆమె బుధవారం రైతులతో కలిసి తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు.

భక్తుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

తిరుపతి కల్చరల్: అలిపిరి మార్గం ద్వారా కాలినడకన తిరుమల వెళ్లే భక్తుల రక్షణ కోసం టీటీడీ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని అఖిల భారత హిందూ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జున గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. టీటీడీ అధికారులు స్పందించి జంతువుల జీవ వైవిధ్యానికి ప్రమాదం లేకుండా దారి మధ్యలో జంగిల్ బ్రిడ్జ్‌ల నిర్మాణం చేపట్టాలని కోరారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై హర్షం

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో 2014 ముందు నుంచి ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని వైఎస్ఆర్‌టీయూసీ జోనల్ ఇన్‌చార్జ్ ఎస్.రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తద్వారా వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. చంద్రబాబు కాంట్రాక్ట్ ఉద్యోగులను ఏ మాత్రం పట్టించుకోలేదని, ప్రస్తుత సీఎం మాట ఇచ్చిన ప్రకారం స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా ఫైల్‌పై సంతకం చేయడం సంతోషకరమని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఇద్దరికి రిమాండ్

తిరుపతిలీగల్: ఏటీఎంలలో పెట్టాల్సిన రూ.2,51,39,000 స్వాహా చేసిన ఇద్దరికి ఈ నెల 30వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లికి చెందిన ఎస్.కిరణ్‌తేజ, తిరుపతి సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన సీ.జయప్రకాష్ సెక్యూర్ వ్యాల్యూ కంపెనీ(ఎస్వీఐఎల్)లో క్యాష్ కస్టోడియన్లుగా పనిచేస్తున్నారు. వారు ఏటీఎంలలో పెట్టే రూ.2.51 కోట్లను స్వాహా చేశారు. బ్యాంకు అధికారులు రికార్డులను తనిఖీ చేయగా విషయం బయటపడింది. దీనిపై ఎస్వీఐఎల్ మేనేజర్ దాసరి కోటేశ్వరరావు తిరుపతి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

మహిళా వర్సిటీలో కంటి వైద్య శిబిరం

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.అనన్య ఆధ్వర్యంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా వీసీ భారతి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి వితరణ

తిరుపతి కల్చరల్: మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌పీజేఎన్ఎం హైస్కూల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి వితరణ చేశారు. ట్రస్ట్ చైర్మన్ ఎం.సూర్యనారాయణరెడ్డి, ఎంఈవోలు బాలాజీ, భాస్కర్ నాయక్, పాఠశాల హెచ్ఎం మునిశేఖర్, ట్రస్ట్ కోఆర్డినేటర్ రహమతుల్లా షరీఫ్, రేవంత్, సుదర్శన్ పాల్గొన్నారు.

ఎస్వీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు..

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీ హైస్కూల్ 1972–76వ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు బుధవారం తిరుపతి సరోజినీదేవి రోడ్డులోని నగరపాలక ప్రాథమిక పాఠశాలకు రూ.15 వేలు విలువైన విద్యా సామగ్రి వితరణ చేశారు. వాటిలో క్రీడా సామగ్రి, ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్, కథల పుస్తకాలు ఉన్నాయి. గత ఏడాది ఇదే పాఠశాలకు వారు రూ.30 వేల ఎల్ఈడీ టీవీ, మైకు సెట్, స్పీకర్లు అందజేశారు. పూర్వ విద్యార్థులు సంపత్, రామచంద్రారెడ్డి, కృష్ణ, నాగరాజు, హెచ్ఎం బి.శారదావేణి, ఉపాధ్యాయులు వాసవి, చక్రధర్ పాల్గొన్నారు.